ఒక వ్యక్తి తను వున్న ప్రదేశం నుంచి వేరే రాష్ట్రానికి వెళ్ళి, వేరే భాష మాట్లాడవలసి వచ్చినప్పుడు ఎంత కష్టపడతాడో, అలాగే కొత్తగా భాష నేర్చుకోవడానికి పసిపిల్లవాడు కూడా అంతే కష్టపడతాడు.

దాన్ని సులభతరం చెయ్యడానికి తల్లిదండ్రులు ప్రయత్నిస్తూ వుండాలి. పిల్లలలో నేర్చుకోవాలనే ఆసక్తి ఎక్కువ వున్నప్పుడే వాళ్ళకి ఆ యా విషయాలు నేర్పడం చాలామంచిది. కొంతమంది తల్లులు, పిల్లలు ఎనిమిదో క్లాసు చదువుతున్నా వాళ్ళే సాక్స్ తొడగడం, షూ వెయ్యడం లాంటివి చేస్తూ వుంటారు.

ఈ విధంగా పిల్లల్ని తమ మీద ఆధారపడేలా చేసుకోవడం ద్వారా వాళ్ళొక విధమైన గర్వాన్ని పొందుతూ వుంటారు. పిల్లవాడు తమ మీద ఆధారపడుతున్నాడు అనే భావాన్ని తల్లిదండ్రులు ఎంత తొందరగా వదులుకుంటే అంత తొందరగా పిల్లలు తమ స్వయంప్రతిపత్తిని ఆపాదించుకుంటారు.

'నేను లేకపోతే మావాడొక్క పనీ చేసుకోలేడండీ' అని గర్వంగా చెప్పుకొనే తల్లులున్నారు. అంటే ఆ తల్లి ఇండైరెక్టుగా తన కొడుకుని ఒక నిర్వీర్యుణ్ణిగా తయారుచేస్తోందన్నమాట.

పది, పన్నెండేళ్ల వయసులో పిల్లలని ఓ పదిరోజులపాటు దూరంగా వుంచడం ద్వారా కూడా తల్లితండ్రులు అతని యొక్క వ్యక్తిత్వం బయటి ప్రపంచంలో తెలుసుకొనేలా చెయ్యడానికి దోహదపడుతుంది.

టూరిజం :

పిల్లల్ని ఎంత చిన్నవయసులో వీలైతే అంత చిన్న వయసులో యింటినుంచి ఎస్కర్షన్స్ రూపేణా, టూర్స్ రూపేణా బయటికి పంపించడమనేది చాల ఆశ్చర్యకరమైన విషయం. తల్లిదండ్రులనుంచి దూరంగా వుండటం వల్ల వాళ్ళకి తల్లిదండ్రుల యొక్క విలువ తెలిసే అవకాశం వుంది.

అదీకాక, కొత్త పరిస్థితుల్లో కొత్త వ్యక్తులతో ఎలా మెలగాలనేది కూడా పిల్లలకి అలవాటవుతుంది. ప్రతి ఏడాదీ వేసవి శలవుల్లో పిల్లలని తాతయ్య యింటికో, నాయనమ్మ యింటికో పంపించడం కాకుండా, ఏదేనా దూరప్రాంతాలకి పంపినట్లయితే, ఆ ప్రాంతాల సంస్కృతి, భాషా, పరిస్థితులు అన్నీ అవగతమౌతాయి.

ఏదేనా కష్టమొచ్చినప్పుడు తమ కాళ్ళమీద తాము నిలబడి స్వంత నిర్ణయాల ద్వారా ఆ కష్టాన్ని అధిగమించడం యెలా అనే విషయం కూడా తెలుస్తుంది. ఇది ఎంతో ముఖ్యమైన విషయమైనా చాలామంది తల్లిదండ్రులు దీన్ని గుర్తించరు. పిల్లవాణ్ని వదిల్తే వాడెక్కడ తప్పిపోతాడో, లేకపోతే తిరిగి రాడేమో అన్న భయాలు చాలా వుంటాయి.

ముందు తల్లిదండ్రులు తమ భయాల్ని అధిగమించాలి. నేను సినిమాల్లో స్క్రీన్‌ప్లే వ్రాసే రోజుల్లో తమిళం నేర్చుకుందామని పుస్తకాలు కొనుక్కుని మూడు నెలలు కష్టపడ్డాను. నాకేమీ రాలేదు కానీ, మద్రాసులో రెండు నెలలు వుండవలసి వచ్చినప్పుడు, అక్కడ నా సహ మిత్రులతోనైతేనేమి, అక్కడున్న వ్యక్తులతో అయితేనేమి తప్పనిసరిగా తమిళంలో మాట్లాడవలసిన అవసరం వచ్చింది. ఆ అవసరమే నాకు కొద్దిగా తమిళాన్ని నేర్పింది.

ఎప్పుడైనా సరే మనిషికి అవసరం కన్నా మించిన గురువేమీ లేదు. నా పదిహేడేళ్ళ వయసులో, కాకినాడ పి.ఆర్ కాలేజీలో చదువుతూ వున్నప్పుడు నేను కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ టూర్ వేళ్ళేను.

ఒక స్పెషల్ ట్రెయిన్‌లో ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన మూడువందల మంది విద్యార్థులతో కలిసి అలా టూర్ వెళ్లడం నా జీవితంలో అది గొప్ప ముఖ్యమైన సంఘటన. అది నా మీద నాకు నమ్మకాన్ని పెంచింది. అక్కడ మనకి టైం అయ్యేసరికి భోజనాలకి ఎవరూపిలవరు.

నువ్వు వెంటనే స్నానం చెయ్యి లేకపోతే నీళ్ళుండవు అని ఎవ్వరూ హెచ్చరించరు. జేబులో డబ్బులేమో చాల తక్కువగా వుంటాయి. చుట్టూ వున్న పరిస్థితులు మాకేమాత్రం సంబంధం లేనివి, అర్థంకానివి. ఇటువంటి పరిస్థితుల్లో మా అవసరాలు మేము పూర్తి చేసుకుంటూ, ప్రయాణం సాగించడం నాలో ఒక చారిత్రాత్మకమైన వ్యక్తిత్వపు మార్పుకి దోహదపడింది.

ఇల్లూ, స్కూలు, మళ్ళీ ఇల్లూ అనే కాకుండా ఈ విధంగా తోటి వ్యక్తులతో కలిసి ప్రయాణం చేస్తుంటే మిగతా కుర్రవాళ్ళ వ్యక్తిత్వం వాళ్ళ ఊహలు, భావాలు అన్నీ తెలుసుకునే అవకాశం కూడా చిన్నపిల్లలకి లభిస్తుంది.

ఒక పిల్లవాడు సంపూర్ణమైన వ్యక్తిత్వం సంపాదించుకోవాలంటే తల్లిదండ్రులు అతనిపట్ల తమకున్న ప్రేమని కొంచెం తగ్గించుకోవలసి వుంటుంది. అలాగే అతడు తనమీద ఆధారపడడాన్ని కూడా తగ్గించుకునేలా చేయవలసి వుంటుంది.

అయితే, మరికొన్ని పెద్ద యిళ్ళలో క్రమశిక్షణ పేరుతో ఆ పిల్లల్ని గిరిగీసి అందులో వుంచుతారు. అతనికొక సపరేట్ గది, విడిగా ఒక బాత్‌రూం యిలా అన్నీ విడిగా కేటాయిస్తారు. కేవలం భోజనం చేసే సమయంలోనో, రాత్రిపూట టి.వీ. చూసే టైమ్‌లోనో మాత్రమే కుటుంబ సభ్యులందరూ కలుసుకుంటారు. ఈ విధంగా చెయ్యడం వలన అతడు ప్రేమరాహిత్యంలోకి దిగవచ్చు. ఇలాంటి విపరీత ధోరణి కూడా అనుసరణీయం కాదు.

స్కూల్ :

పిల్లల స్వాతంత్ర్యం మీద సరియైన అవగాహన లేని స్కూల్ టీచరు చాలా దారుణంగా ప్రవర్తిస్తూ వుంటాడు. ఖాళీగా పీరియడ్స్ వున్న టైంలో నోటిమీద వేలువేసుకొని కూచోమనడం, పదే పదే 'సైలెన్స్', 'సైలెన్స్' అని అరవడం యివన్నీ మానసికంగా పిల్లల్ని దెబ్బతీసి వాళ్ళని 'ఇంట్రావర్ట్స్'ని చేస్తాయి.

పిల్లలని తరచూ కొట్టడం ద్వారా వాళ్ళలోని సున్నితత్వాన్ని టీచర్లు చంపేస్తూ వుంటాడు. ఒక దెబ్బకన్నా, ఒక మాట ద్వారా పిల్లలని మార్చడం చాలా సులభం. పిల్లల్లో లేని 'కులం' అనే భావాన్ని కొంతమంది టీచర్లే ఎత్తిచూపడం శోచనీయం. ఇదే విధంగా డబ్బున్న పిల్లల్ని ఒకలాగ, డబ్బులేని పిల్లల్ని ఒకలాగ చూడటం కూడా మంచిది కాదు.

తమ స్కూల్ నుంచి ఎక్కువమంది పాసవాలన్న ఉద్దేశ్యంతో పరీక్షలలో తామే పుస్తకాలు అందజెయ్యడం, కాపీకొట్టినా చూసీ - చూడనట్టు ఊరుకోవడం - ఇవన్నీ పిల్లల్లో సమాజంపట్ల ఒక అగౌరవమైన భావం రావడానికి తోర్పడతాయి. అందరూ చెడు చేస్తున్నారు, చెడుగా వుంటేనే జీవితంలో పైకి రాగలం అనే భావం పిల్లల మనసులో రాకుండా చెయ్యడానికి టీచర్లే చాలా కష్టపడవలసి వుంటుంది.

దురదృష్టవశాత్తూ మన సమాజంలో స్కూల్స్ కేవలం చదువు మాత్రమే బోధిస్తున్నాయి. బిహేవియర్ సైన్స్, మనిషి ప్రవర్తన, అతనిలో వుండే బలహీనతలు పోయేలా చెయ్యటం - అలాంటి పనులేవీ చేపట్టవు.

ఉదాహరణకి ఒక కుర్రవాడు విపరీతమైన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతూ వుంటే, ఆ బాధని పోగొట్టడానికి ఏ విధమయిన ప్రయత్నం చెయ్యరు. వారి బాధ్యతల్లా ఆ సంవత్సరం సిలబస్‌ని పూర్తిచెయ్యడం మాత్రమే. అందుకని తల్లిదండ్రులు పిల్లలని కేవలం స్కూల్‌కి పంపడంతోనే తమ బాధ్యత తీరిపోయిందనుకోకుండా, వారిలో ఇబిడీకృతమైవున్న బలహీనతలను గుర్తించి, వాటిని పారద్రోలే ప్రయత్నం చెయ్యాలి.

మంచి పాఠకుడయితే, రచయిత వాక్యాన్ని, సొగసుని, పదాల గారడీని అర్థం చేసుకొని ఆస్వాదించగలడు. రచయిత చెప్పే భావాన్ని అర్థం చేసుకొని, తన మెదడు పొరల్లో నిక్షిప్తం చేసుకోగలడు. అలాగే మంచి పాఠకుడు కానివాడు రచయిత ఎంత గొప్పగా రాసిన పుస్తకాన్నైనా సరే యథాలాపంగానే చదువుతాడు.

ఈ టైమ్‌పాస్‌కు చదివే చదువు మనసుకీ, మెదడుకీ ఎక్కదు. ఒకవేళ మనసుకి ఎక్కినా అది కేవలం రసానుభూతిని మాత్రమే కలిగిస్తుంది. అదే విధంగా విద్యార్థులు చిన్న వయసులో స్కూలు పుస్తకాలని కేవలం బట్టీపటడం ద్వారా ఏమీ సాధించలేదు. దానివలన ప్రయోజనం వుండదు కూడా.

ముఖ్యంగా లెక్కలు, ఫిజిక్స్ మొదలగు సబ్జక్ట్స్‌లో తక్కువ మార్కులు వచ్చే వారు ఈ

కోవకు చెందుతారు. వారు ఒక లెక్క ఆన్సర్ సంపాదించడానికి దానిని ఏవైపు నుండి ఎదుర్కోవాలా అని ఆలోచించడం చెయ్యలేరు. ఈ బట్టీ పట్టడం అనేది చిన్న చిన్న క్లాసులలో సాధ్యమవుతుందేమోగాని, గ్రాడ్యుయేషన్ స్థాయికొచ్చేసరికి సబ్జక్ట్సు చాలా విస్తృతంగావ ఉండటంవల్ల, అప్పటికి వయసు పెరిగి మెదడు యొక్క స్టోర్ చేసుకునే శక్తి తగ్గిపోవడం వల్ల చాలా యిబ్బందులకు గురవుతారు.

పెద్ద పాఠాన్ని, పాఠ్యాంశాన్ని గుర్తుపెట్టుకోవలసి వచ్చినప్పుడు, దాన్ని ముక్కలు ముక్కలుగా చేసి ఒక ఆర్డర్‌లో పేర్చుకొని, కేవలం పాయింట్స్ మాత్రమే గుర్తు పెట్టుకొని పరీక్ష హాల్లో వాటిని విశ్లేషించి రాయటం అన్నది అన్నిటికన్నా ఉత్తమ మైన పద్ధతి. ఇలా చిన్న చిన్న పాయింట్లుగా గుర్తుంచుకోవటం వల్ల, అది మన జీవితకాలం మొత్తం గుర్తుండే అవకాశముంటుంది.

ఎప్పుడైనా సరే ఒక మనిషి తన నిజజీవితంలో పైకి రావాలంటే, తర్కం చాలా అవసరం. ఈ సత్యాన్ని లెక్కలు, ఫిజిక్స్ భోదిస్తాయి. ఉదాహరణకి బోటనీ, జువాలజీ చదివిన అమ్మాయి, తర్వాత బ్యాంకులో క్యాషియర్ అయి అకౌంట్స్ రాస్తుంది.

18-20 ఏళ్ళ మధ్యలో సైన్సు చదువుకున్న అమ్మాయిలనీ, అబ్బాయిలనీ పరిశీలించినట్లయితే ఆకుల్ని స్వీకరిస్తూ లేదా కప్పలని కోస్తూ బి.ఎస్సీ. పూర్తిచేస్తారు. నిజ జీవితంలో చాలామందికి అవి ఏ విధంగానూ ఉపయోగపడవు.

చెక్కుకి, డ్రాఫ్టికి తేడా తెలియని గ్రాడ్యుయేట్లూ, ఎలక్ట్రిసిటీ బిల్లు ఎలా కట్టాలో తెలియని విద్యార్థినీ విద్యార్థులూ పదిమంది ముందు మాట్లాడవలసివస్తే తడబడే కుర్రవాళ్ళూ మనకి చాలాచోట్ల కనిపిస్తూ వుంటారు. స్కూల్‌లో చెప్పని ఇటువంటి విషయాలన్నీ తల్లిదండ్రులకే బాధ్యతగా నేర్పాల్సి వుంటుంది.

చాలా మంది తండ్రులు అసలు పిల్లలు ఏం చదువుతున్నారనేది పట్టించుకోరు. రాత్రెప్పుడో పది గంటలకి ఇంటికొచ్చి పడుకోవడం, పొద్దున్న ఆఫీసుకి వెళ్ళడం, మళ్ళీ సాయంత్రాలు క్లబ్‌కి వెళ్ళడం వీళ్ళ దినచర్య. తల్లులుకూడా ఏ ఆరోతరగతివరకో, ఎనిమిదో తరగతి వరకో శ్రద్ధగా చదివించి, ఆ తర్వాత ఓపిక లేక విడిచి పెట్టేస్తారు.

సరిగ్గా ఈ వయసులో పిల్లలు, ఒక్కసారి ఇంటిపరిధినుంచి బయటపడి తిరగడమే స్వేచ్ఛ అనుకొనే మనస్తత్వంలో వుంటారు. అప్పటినుండి చదువుమీద వారికి ఇంట్రస్ట్ తగ్గిపోతుంది. పిల్లల చదువు బాధ్యతలో తండ్రులే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. కనీసం నాలుగురోజుల కొకసారైనా పిల్లలని దగ్గిర కూర్చోబెట్టుకుని, ఆ నాలుగు రోజులు ఏం చదివారో ప్రశ్నలు వేస్తే అతను ఒక విధమైన భయంతో చదువుపట్ల శ్రద్ధ చూపుతాడు.

ఎలక్యూషన్ కాంపిటీషన్స్, వ్యాసరచన పోటీలు మొదలయినవి పిల్లల్లో వుండే అంతర్గత భయాన్ని పోగొడ్తాయి. టీచర్లు పిల్లలని ఇటువంటి పోటీలలో ఎవరికి ఇంట్రస్ట్ అయితే వారు

పేర్లివ్వండి అనకుండా కనీసం మిగతా పిల్లలకి వేదిక మీదకొచ్చి రెండు మూడు నిమిషాలు మాట్లాడే అవకాశం కల్పించాలి.

చిన్నపిల్లలకి గ్రూప్ డిస్కషన్స్ ఏర్పరచడం ద్వారా కూడా వాళ్ళలో వుండే కాంప్లెక్స్‌ని పోగొట్టవచ్చు. చాలామంది వ్యక్తుల్ని మనం గమనించినట్లయితే, వాళ్ళు 30 ఏళ్ళు గడిచినా కూడా తమ మనసులో వున్న భావాన్ని నిర్భయంగా అవతలివాళ్ళకి అర్థం అయ్యే రీతిలో చెప్పలేరు. ఇలాంటి కాంప్లెక్స్‌లు వుండటానికి కారణం, చిన్నపిల్లలుగా వున్నప్పుడు వాళ్ళకి ఉత్తమమైన శిక్షణ లేకపోవడమే.

పిల్లల వైపునుంచి ఆలోచించటం :

పిల్లలు ఏమైనా పదాలు బాగా మాట్లాడకపోతే వాటిని సరిదిద్దవచ్చు తప్ప, భావాలు సరిగ్గా లేకపోతే వాటిని వెంటనే సరిదిద్దకుండా వారివైపునుండి ఆలోచించి, అవి కరెక్ట్ అయినవో కావో మనం నిర్ణయించుకోవాలి.

మనం ఎప్పుడైనా పేక ముక్కలతో పిల్లలదగ్గర మేడకట్టి చూపిస్తే ఆ పాప దగ్గరకొచ్చి ఆ మేడను కూల్చి మీ వైపు చూసి నవ్వుతుంది. మళ్ళీ మీరు మేడ కట్టినా ఆ పాప తిరిగి దానిని కూలగొడుతుంది. అంటే మీకు మేడకట్టడంలో వున్న ఆనందం ఆ పాపకి చిన్నాభిన్నం చేయడంలో వుంది.

ఈ విధంగా చిన్నపిల్లలలో మనయొక్క భావాన్ని తొందరగా స్వీకరించకపోవడం అనే గుణం వుంటుంది. పిల్లల మనస్తత్వ శాస్త్రవేత్తలు చెప్తున్న ప్రకారం, చిన్నపిల్లలు ఏ పనైనా తాము చెయ్యగలం అనుకుంటారు. కానీ వయసు పెరిగేకొద్దీ తాము తెలుసుకున్నది చాలా తక్కువ అని తెలుసుకుంటారు. అయితే కొంతమంది వయసు పెరిగినా కూడా, ఏ పనైనా తాము చెయ్యగలం అనే (భ్రమ) మానసిక స్థాయిలోనే వుంటారు.

తమ అభిప్రాయం తప్పని, తమకన్నా తెలిసిన వాళ్ళుంటారనే జీవిత సత్యాలని తెలుసుకోవడానికి ఒక మనిషికి చాలా ఉన్నతమైన మానసిక స్థాయి వుండాలి. తాము చేసింది చాలా కరెక్ట్ అని మనుషులు అనుకోవడానికి ఒక మంచి ఉదాహరణ మా రైటర్స్ వర్క్‌షాప్.

వర్ధమాన రచయిత (త్రి)లలో సృజనాత్మకశక్తిని పెంపొందించి, వాడిని రచయితలుగా తీర్చిదిద్దుదామని మే మొక వర్క్‌షాప్ పెట్టాం.

అక్కడకొచ్చిన చాలామంది కుర్రవాళ్ళు, అమ్మాయిలు తాము వ్రాసింది మాకు చూపిస్తే దాన్ని మేము మెచ్చుకుంటే సరేసరి...... ఒకవేళ్ళ దాన్ని మేము దిద్దితే..... మేమేదో పెద్ద పొరపాటు చేశామని మావైపు జాలిగానో, కోపంగానో చూస్తూ వుంటారు. వాళ్ళు రాసింది పత్రికల స్థాయిలో లేదని గాని లేదా వాళ్ళ భావాలని పాఠకులు అర్థం చేసుకోలేరనిగాని మేం చెప్తే వాళ్ళ స్థాయికి మేము ఎదగలేదన్నట్లుగా భావిస్తారు.

ఈ విధంగా తమమీద తమకి ఎక్కువ నమ్మకం వుండటం అనేది చిన్నపిల్లలలో చాలా ఎక్కువగా కనబడుతుంది. మనం ఆ నమ్మకానికి ఎటువంటి దెబ్బకొట్టకుండా వాళ్ళని సరియైన పంథాలోకి మార్చుకోవలసి వుంటుంది. అలా కాకుండా అసలు మీకేమీ చేతకాదు. మీరేమీ రాయలేరు అని మేం అంటే ఇక ఆ వర్క్‌షాప్‌కి వాళ్ళు రావటం మానేస్తారు. అలాగే చిన్నపిల్లలకి కూడా నీకేం చేతకాదు, నువ్వు చేస్తున్నది తప్పు అని తరచూ అంటూ ఒక "డీగ్రేట్ ఆటిట్యూడ్" ని డెవలప్ చేస్తూ ఇంజెక్ట్ చేస్తే, కొంతకాలానికి వాళ్ళూ పూర్తిగా మన మాట వినడం మానేయడమో, వాళ్ళలో వాళ్ళు కుంచించుకుపోవడమో జరుగుతుంది.

తల్లిదండ్రులు ఎంత జాగ్రత్తగా మంచిగా తీర్చిదిద్దినా సరే, పిల్లలు వాళ్ళనే మార్గదర్శకులుగా ఎన్నుకుంటారని చెప్పడానికి వీలులేదు. సాధారణంగా చిన్నపిల్లలు తమ బాబాయిలనో, మామయ్యలనో మార్గదర్శకులుగా ఎన్నుకుంటారు. అందులో తప్పేం లేదు కూడా. ఎందుకంటే తమ కన్నా వయసులో చాలా పెద్దవాళ్ళయిన తల్లిదండ్రులతో కమ్యూనికేషన్ ఏర్పరచుకోవడానికి, పిల్లలు సాధారణంగా అంత ఉత్సాహం చూపించరు.

పిల్లలు మొదట ఎనిమిది, పది సంవత్సరాలవరకూ తమ తల్లి దండ్రులని ఈ ప్రపంచంలోకెల్ల అత్యంత మేధావులుగా, గొప్పవాళ్ళుగా త్యాగమూర్తులుగా భావిస్తూ వుంటారు. కానీ, ఆ వయసు దాటిన తర్వాత తల్లిదండ్రులు కూడా సామాన్య మనుషులేనని వాళ్ళూ అందరిలాగే అబద్ధాలాడుతూ వుంటారని, తండ్రులు లంచాలు తీసుకుంటూ వుంటారని, తల్లి మిగతా స్త్రీలలాగే ప్రవర్తిస్తూ వుంటుందని గుర్తించడం మొదలుపెడతారు.

అందువలన పిల్లల 8 -11 మధ్య వయస్సులో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ప్రవర్తించవలసి వుంటుంది. పిల్లలకి 14 ఏళ్ళు వచ్చేసరికి ప్రపంచం అంతా బాగుంది, నాలోనే ఏదో డిఫెక్టు వుంది అన్న భావన స్థాయిలో వుంటారు. అప్పుడు వాళ్ళలో ఒక మానసిక బలాన్ని పెంచడానికి తల్లిదండ్రులు ప్రయత్నించాలి.

పదిహేను, పదహారేళ్ళు దాటిన తర్వాత పిల్లలకి ప్రపంచం అంతా బాగులేదు నేనొక్కణే (నేనొక్కదాన్నే) గొప్పవాణ్ణి, నాలో చాలా తెలివితేటలున్నాయి అనే భావం ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో వాళ్ళ అహానికి ఎటువంటి దెబ్బ తగలకుండా వాళ్ళని జాగ్రత్తగా మళ్ళీ దారిలోకి తీసుకు రావాలని వుంటుంది.

వయసు పెరిగేకొద్దీ పిల్లలలో వచ్చే మార్పులు కూడా గమ్మత్తుగా వుంటాయి.